


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 314 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 16 జూలై 2026 వెల : 1/-రూ ॥
VOLUME :12 ISSUE :314 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 16 JULY 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ముద్రగడ పాడె మోసిన జగన్



మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం భౌతిక కాయానికి వైసీపీ అధినేత జగన్ నివాళులర్పించారు. ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన జగన్, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముద్రగడ పార్థివ దేహానికి రాజకీయ ప్రముఖులు, ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పిస్తున్నారు. కాసేపటి క్రితం ముద్రగడ అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముద్రగడ పాడెను జగన్, వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ మోశారు.




ఎపిసోడ్ - 3

### అయ్యవారి భాగోతాలు

- ప్రైవేట్ వ్యక్తుల జోక్యం
- ప్రభుత్వ ఉద్యోగులను పక్కన పెట్టడం
- ప్రైవేట్ సిబ్బందితో విధులు నిర్వహణ
- ప్రజలకు అనవసర వేధింపులు
- అధిక ఫీజులు వసూలు ఆరోపణలు
- సున్నితమైన రికార్డుల భద్రతపై నిర్లక్ష్యం
- బయోమెట్రిక్ ప్రక్రియలపై సందేహాలు
- అక్రమ సూచనలు - ఎవరి ప్రయోజనం?

వివరాలు 2లో..

ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు.. ఎపిసోడ్ - 2

# ఇక్కడ నేనే రూల్...

## ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం..?

అయ్యవారి భాగోతాలు **చిట్టా..**

- ప్రభుత్వ ఉద్యోగులను పక్కన బెట్టి ప్రైవేట్ సిబ్బందితో విధులు
- రిజిస్ట్రేషన్ కోసం వచ్చిలకు ప్రజలకు వేధింపుల ఆరోపణలు
- సున్నితమైన ప్రభుత్వ రికార్డులు, బయోమెట్రిక్ ప్రక్రియలపై ప్రశ్నలు
- "ఇక్కడ నేనే రూల్" అన్నట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు
- స్వతంత్ర విచారణకు ప్రజలు, బాధితుల డిమాండ్

వరుసగా విత్ ఎవిడెన్స్ తో పెన్ పవర్ పాఠకుల కోసం చదువుతూనే ఉండండి పెన్ పవర్..



## ఒకరోజు 'మావిగన్', ఇంకోరోజు 'బెంతాహై'..

### జగన్‌పై మంత్రి లోకేశ్ సెటైర్లు

- జగన్ రోజుకో మాట మార్చుతారంటూ విమర్శలు
- రాయలసీమ అభివృద్ధికి జగన్ ఒక క్యాన్సర్ గడ్డలా మారారని వ్యాఖ్యలు
- వైసీపీ ఒక హిట్ అండ్ రన్ పార్టీ అంటూ తీవ్ర ఆరోపణలు
- పరిశ్రమలను బెదిరించి, యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రోజుకో మాట, పూటకో వేషం వేస్తుంటారని, ఒకరోజు 'మావిగన్' అంటే, మరోరోజు 'బెంతాహై' అంటారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తాము చట్టప్రకారం పాలన చేస్తుంటే, లా అండ్ ఆర్డర్‌ను చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కడప జిల్లా జమ్మలమడుగు

- మిగతా 2లో



## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

# సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ పనుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు

- మిగతా 2లో

## అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం:

# సీఎం చంద్రబాబు





- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు

- మిగతా 2లో

### విమర్శలే కాదు.. మోసాన్ని మ్యూజియంలో పెడతా

"వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్ర ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలాడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీకమైన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను.

**2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని, గేట్లకు కనీస నిర్వహణ కూడా చేయలేదని ఆరోపించారు. కాంట్రా క్టర్ల కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.**




### 36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు

రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తాం

| | |
|---|---|
| పోలవరం ప్రాజెక్టు | – 2027 మార్చి నాటికి పూర్తి |
| వెలిగొండ ప్రాజెక్టు (తొలిదశ) | – 2025 సెప్టెంబర్ 1న ప్రారంభం |
| గుంటూరు ఛానల్ ఆధునికీకరణ | – 2026 జూన్ నాటికి పూర్తి |
| చింతలపూడి ఎత్తిపోతల | – 2026 ఆగస్టు కల్లా పూర్తి |
| వరికపూడిశెల ప్రాజెక్టు | – 2027 జూన్ నాటికి పూర్తి |

### మహనీయుల స్ఫూర్తితో ముందుకు



డా. కేఎల్ రావు | సర్ ఆర్థర్ కాటన్ | శివరామకృష్ణయ్య | నందమూరి తారకరామారావు

ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



## చంద్రబాబు సానుభూతిపరులు

# సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు

- భీమవరంలో ఆక్వా రైతులతో జగన్ ముఖాముఖి
- ఫీడ్, సీడ్ రేట్లను చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని విమర్శ
- చంద్రబాబు ప్రతి అడుగు మోసమేనని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో ఉందని, ఆక్వా రైతులు దీనావస్థలో ఉన్నారని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన జగన్... ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. ధరల పెరుగుదలకు హేతుబద్ధత ఉండాలని, ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. దున్నపోతు

- మిగతా 2లో

## క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ



పెన్ పవర్ డెస్క్:క్రిప్టో కరెన్సీని నియంత్రించే అంశంపై ఆలోచించాల్సిందిగా ఆర్‌బీఐ, సెబీలను ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించినట్లు సామా జిక మాధ్యమాల్లో జరుగుతున్న

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ 'ఇలా.. ఇలా..' : చంద్రబాబు మరోలా!

రాజకీయ నేతలకు తమ మాటే ఒక ఆయుధం. బాడీ లాంగ్వేజ్ (వ్యవహారశైలి/ఆహార్యం) ప్రజలను కనెక్ట్ చేసే బలమైన వారధి. వేదికపైకి రాగానే చేసే చిన్న సైగ, పదే పదే పలికే ఒక పదబంధం, లేదా ఒక ప్రత్యేకమైన శైలి ఆ నాయకుడికి ప్రజల్లో ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేస్తాయి. తాజాగా భీమవరం సభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనదైన ట్రేడ్ మార్క్ శైలిలో అక్వా రైతుల సమస్యలను ఎలుగెత్తి చాటారు. అక్వా రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించిన జగన్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఫీడ్, సీడ్ ధరలు తగ్గలేదని నిరూపించేందుకు రైతులతో 'ఇలా.. ఇలా.. ఇలా..' చేతులు ఊపండని జగన్ చెప్పించారు. ఈ సన్నివేశం అందరినీ ఆకట్టుకుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో నేతలు ఒక్కొక్కరిది ఒక్కోస్టైల్ అంటూ చర్చ జరుగుతోంది.

**జగన్మోహన్ రెడ్డి : పదే పదే.. గట్టిగా..**

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రసంగాల్లో ఒక లయ ఉంటుంది. ప్రభుత్వాన్ని విమర్శించేటప్పుడు ఒక పదాన్ని రెండు మూడు సార్లు నొక్కి చెప్పడం ఆయన అలవాటు. "ఇలా.. ఇలా.. ఇలా..", "గట్టిగా చేతులు ఊపండి" అంటూ కార్యకర్తలను ఉత్సాహపరచడం, సభలో జోష్ నింపడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తన ప్రసంగాల్లో భావోద్వేగాలను పండించడంలో, ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలను గుప్పించడంలో జగన్ తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారని చెబుతుంటారు.

**చంద్రబాబు స్టైల్ విక్టరీ**

ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన హుందాతనంతో ప్రజలకు అభివాదం చేస్తుంటారు. వేదికపై ఎక్కగానే రెండు వేళ్లతో 'విక్టరీ సింబల్' చూపడం ఆయన ట్రేడ్ మార్క్. ఇది కేవలం ఒక సైగ మాత్రమే కాదు, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే ఒక సంకేతం. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబును చూడగానే అభిమానులు సైతం విక్టరీ సింబల్ చూపుతుంటారు. తెలుగు నేలపై మరే నేతకు ఇటువంటి అభివాదం ఉండదు. చంద్రబాబు మాదిరిగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం విక్టరీ సింబల్ తోనే అభివాదాలు చేస్తుంటారు.

**వైఎస్ రాజశేఖరరెడ్డి : కుయ్.. కుయ్..**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాట తీరులో ఉండే నేర్పు, ప్రజలకు అర్థమయ్యే సరళత అద్భుతం. ఆయన ప్రసంగాలంటేనే ఒక భరోసా. ఉదాహరణకు, 108 అంబులెన్స్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయన చెప్పిన "కుయ్.. కుయ్.. కుయ్.. అంటూ అంబులెన్స్ వస్తుంది" అనే మాట ఇప్పటికీ అందరికీ గుర్తే. సంక్లిష్టమైన పథకాలను కూడా సామాన్యుడికి అర్థమయ్యేలా, తన మాటలతో వారి మనసు గెలుచుకోవడం వైఎస్సార్‌కే చెల్లిందని ఆయన అభిమానులు చెబుతుంటారు.

**కేసీఆర్: యాసలో ఆత్మగౌరవం**

తెలంగాణకు చెందిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపన్యాస శైలిని ఎవరూ అనుకరించలేరు. తెలంగాణ యాసను, సంస్కృతిని తన మాటల్లో జోడించి, ప్రజల్లో ఆత్మగౌరవాన్ని రగిల్చడం ఆయన ప్రత్యేకత. చమత్కారాలు, వ్యంగ్యాస్త్రాలు, పురాణ గాథలు, ఉర్దూ, తెలుగు పదాల మిశ్రమంతో ఆయన చేసే ప్రసంగాలు సభికులను కట్టిపడేస్తాయి. "ఏం జరగాలి?", "ఏం కావాలి?" అని ఆయన పలికే తీరులో ఒక రకమైన ఆవేశం, వాదన కనిపిస్తుంది.

**రేవంత్ రెడ్డి: దూకుడు.. ఆవేశం**

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో దూకుడు కనిపిస్తుంది. ఆయన మాటల్లో ఆవేశం, వాస్తవాలను ఎత్తిచూపే ధైర్యం ఉంటాయి. ప్రత్యర్థులను అడ్రస్ చేసే విధానం, ప్రజల సమస్యలపై స్పందించే తీరులో ఒక రకమైన 'కౌంటర్' ఫాలో అవుతుంటారు. ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యేందుకు ఆయన వాడే భాష, ఉపయోగిస్తున్న బాడీ లాంగ్వేజ్ ఆయనకు యువతలో ఒక ప్రత్యేక క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి.

నాయకుల వ్యవహారశైలి గమనిస్తే బహిరంగ సభలు లేదా సమావేశాల్లో నాయకుడు చెప్పే అంశం ఎంత ముఖ్యమో, దాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనేది అంతకంటే ముఖ్యమని అంటున్నారు. తమదైన హావభావాలు, ట్రేడ్ మార్క్ మాటలతో ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకోవడం మన నేతల నైజం అంటున్నారు.

# క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ

- మొదటి పేజి తరువాయి

ప్రచారాన్ని కేంద్రం ఖండిం చింది. అవన్నీ అవాస్తవాలని కొట్టిపారేసింది. అలాంటి ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. క్రిప్టో కరెన్సీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని కేంద్రం పేర్కొంది. క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా పరిగణించడం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వదంతులను నమ్మొద్దని తెలిపింది. విశ్వసనీయం సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే సందర్శించాలని సూచించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలు వ్యాప్తి జరిగినప్పుడు వెంటనే కేంద్రం దృష్టికి తీసుకురావాలని కోరింది. ఇందుకు ०91 8799711259 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని లేదంటే factcheck@pib.gov.in మెయిల్ చేయాలని సూచించింది.

## ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు... ఎపిసోడ్ -2

# ఇక్కడ నేనే రూల్...

- భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వివాదం..
- ప్రైవేట్ సిబ్బందితో విధులు, ప్రజలకు ఇబ్బందుల ఆరోపణలు
- ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం..?
- ప్రభుత్వ ఉద్యోగులను పక్కనబెట్టి ప్రైవేట్ సిబ్బందితో విధులు
- రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలకు వేధింపుల ఆరోపణలు
- సున్నితమైన ప్రభుత్వ రికార్డులు, బయోమెట్రిక్ ప్రక్రియలపై ప్రశ్నలు
- 'ఇక్కడ నేనే రూల్' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు
- స్వతంత్ర విచారణకు ప్రజలు, బాధితుల డిమాండ్

**ఏలూరు జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తులతో ప్రభుత్వ విధులు నిర్వహింపజేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు అందించాల్సిన కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం, వినియోగదారుల పట్ల అనుచిత ప్రవర్తన, ప్రభుత్వ రికార్డుల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు, బాధితులు కోరుతున్నారు.**

ఎడిటర్ పెన్ పవర్ , ఏలూరు జూలై 15 : భీమడోలు గ్రామంలోని ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పటికీ, వారికి కేటాయించిన బాధ్యతల్లో కొంత భాగాన్ని ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహింపజేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, సబార్డినేట్ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, రాణి, సంతోష్, లక్ష్మి అనే ప్రైవేట్ వ్యక్తులు కూడా కార్యాలయ పనుల్లో పాల్గొంటున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలను అవసరానికి మించి వేచి ఉండేలా చేస్తున్నారని, త్వరగా పూర్తి చేయాల్సిన ప్రక్రియలను ఆలస్యం చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. కొందరితో అనుచితంగా మాట్లాడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా, వేలిముద్రలు, బయోమెట్రిక్ ధృవీకరణ, రికార్డుల నిర్వహణ వంటి సున్నితమైన ప్రభుత్వ ప్రక్రియల్లో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం ఉందని ఫిర్యాదులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే, ప్రశ్నించిన వారితో "ఎవరికి ఫిర్యాదు చేయాలనుకుంటే వారికి చేయండి", "ఇక్కడ నేనే రూల్" అన్న తరహాలో స్పందిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అది ప్రభుత్వ సేవల పారదర్శకత, ప్రజా విశ్వాసంపై ప్రభావం చూపే అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఎపిసోడ్ -3 లో అయ్యవారి బాగోతాలు చిట్టా... వరుస కథనాలు విత్ ప్రూఫ్ ల తో ... పెన్ పవర్ పాఠకులకోసం**

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

**విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు.

తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని,

చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్... సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

ఈ సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను ముఖ్యమంత్రికి వివరించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నమూనా వంటి కీలక అంశాలను ప్రాజెక్టులో భాగంగా చేర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగాలు కల్పించడం ద్వారా అమరావతి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అమరావతిని ఆర్థికంగా పరిపుష్టం చేసేలా 'క్రియేటివ్ సిటీ' నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. ఎల్‌నినోతో ఇబ్బందులు ఎదురైనా, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడంతో రాజధాని ప్రాంతం జలకళను సంతరించుకుందని గుర్తుచేశారు. గ్లోబల్ బెంచ్‌మార్కింగ్ చేరుకోవడం, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి.నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో జగిత్యాల కోర్టు సంచలన తీర్పు... ఐదుగురికి జీవిత ఖైదు..

జగిత్యాల జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసులో సంచలన తీర్పునిచ్చింది కోర్టు. 2020లో మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై బుధవారం ( జులై 15 ) తీర్పు వెల్లడించింది కోర్టు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు.. వారికీ జీవిత ఖైదు విధించింది. అంతే కాకుండా.. ఒక్కో దోషికి రూ.20 వేల జరిమానా విధించిన కోర్టు.. బాధిత మైనర్ బాలికకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. పటిష్ట ఆధారాలతో పోలీసులు, ప్రాసిక్యూషన్ కేసు నిరూపించడంతో ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి రత్న పద్మావతి కీలక తీర్పు వెల్లడించారు. ఇటీవల షాబాద్ లో పోక్సో కేసు నిందితుడు బెయిల్ పై వచ్చి మారణకాండ సృష్టించి చివరికి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపిన క్రమంలో జగిత్యాల పోక్సో కేసు తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. పోక్సో కేసు నిందితులకు బెయిల్ మంజూరు చేయకుండా... వీలైనంత త్వరగా కేసు నిరూపించి శిక్ష విధించాలని కోరుతున్నారు జనం.

# ఒకరోజు 'మావిగన్', ఇంకోరోజు 'బెంతాహై'..

- మొదటి పేజి తరువాయి

సమీపంలోని చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్, వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

**రాయలసీమ అభివృద్ధికి క్యాన్సర్ గడ్డ జగన్**

రాయలసీమ అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ఒక క్యాన్సర్ గడ్డలా మారారని లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ పేరుతో ప్రత్యక్షంగా 10 వేల ఉద్యోగాలు, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. "మైనింగ్ లైసెన్స్ తీసుకుని సుమారు 320 ఎకరాల్లో 'రెడ్ గోల్డ్' సంస్థ పేరుతో ఐరన్ ఓర్‌ను తరలించి విక్రయించుకున్నారు. దీనివల్ల గాలి జనార్ధన్ రెడ్డికి, జగన్‌కు ఆదాయం వచ్చింది తప్ప, కడప యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదు" అని విమర్శించారు. తాము తెచ్చిన కియా పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది జీవనం సాగిస్తున్నారని, ఇదే ప్రజాప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.

**పరిశ్రమలను బెదిరించిన గొడ్డలి పార్టీ**

2019 నుంచి 2024 వరకు కియా యాజమాన్యాన్ని గొడ్డలి పార్టీ నేతలు బెదిరించారని లోకేశ్ ఆరోపించారు. దాల్మియా సిమెంట్‌కైతే ఏకంగా ఫ్యాక్టరీ మూసేయాలని నోటీసులు ఇచ్చారని, డబ్బులిస్తేనే ఫ్యాక్టరీ నడుస్తుందని, లేదంటే మూసేయాలనే ధోరణిలో వైసీపీ నేతలు ప్రవర్తించారని అన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మూడుసార్లు కడప జిల్లాకు వచ్చాం. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం, ఇప్పుడు దాల్మియా విస్తరణకు శంకుస్థాపన చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా నినాదం. దేశంలోనే రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తున్నాం" అని తెలిపారు.

**వైసీపీ ఒక 'హిట్ అండ్ రన్' పార్టీ**

జగన్ రెడ్డి పార్టీకి 'హిట్ అండ్ రన్ పార్టీ' అని పేరు పెట్టవచ్చని లోకేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "జగన్ కాన్వాయ్ వాహనం ఢీకొని ఆ పార్టీ కార్యకర్త సింగయ్య చనిపోతే, శవాన్ని రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. నిజాయతీ ఉంటే కోర్టుకు వెళ్లి స్టే ఎందుకు తెచ్చుకున్నారు? సొంత బాబాయ్‌నే హత్య చేస్తే తప్పు కాదు, కార్యకర్త చనిపోతే తప్పు కాదు" అని తీవ్రంగా విమర్శించారు. తమ హయాంలో మత్స్యకారులు చనిపోతే ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చామని, కానీ జగన్ పాలనలో 250 మంది మత్స్యకారులు చనిపోతే వారి కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉద్యోగాల కల్పనలో విఫలం**

ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదని, కానీ తాము అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే 16,000 డీఎస్సీ పోస్టులు భర్తీ చేశామని లోకేశ్ గుర్తుచేశారు. కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి, త్వరలో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

పెట్రోల్, డీజిల్ ధరలపై జగన్ చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, "జగన్ హయాంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగకపోయినా పెట్రోల్, డీజిల్ ధరలు రూ.35 పెంచారు. అప్పుడు నోరు మెదపని జగన్ ఇప్పుడు విమర్శించడం విడ్డూరంగా ఉంది. అధికారం పోతే ఒక నీతా?" అని ప్రశ్నించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, గండికోట జలాలను సమర్థంగా వినియోగించుకుంటామని లోకేశ్ స్పష్టం చేశారు.

## చంద్రబాబు సానుభూతిపరులు

# సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

మీద వాన పడినట్టు ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు. ఆక్వా రంగం ఐదు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని జగన్ తెలిపారు. చంద్రబాబు సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీడ్, సీడ్ రేట్లు చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని, చంద్రబాబు సిండికేట్ రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఫీడ్ రేట్లు కేజీకి రూ.14 నుంచి 16కి ఎడాపెడా పెంచేశారని, ముష్టి వేసినట్టు కేజీకి రూ.2 తగ్గిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. రేట్లు పెంచితే పెంచేస్తారని... రేట్లు తగ్గితే తగ్గించరా అని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం 'అప్సడా' ఏర్పాటు చేశామని... సీడ్, ఫీడ్, మార్కెటింగ్‌లో సమస్యలు వస్తే పరిష్కరించామని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక 'అప్సడా'ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నామని, రొయ్యలకు మద్దతు ధర తగ్గకుండా మానిటర్ చేశామని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర తగ్గకూడదని చట్టం చేశామన్నారు.

ఈరోజు కేజీ కౌంట్ రూ.230లు దాటని పరిస్థితి ఉందని చెప్పారు. ఆక్వా రైతులకు తాము 1.50కే యూనిట్ విద్యుత్ అందించామని, ఐదేళ్లలో సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.401 కోట్ల సబ్సిడీ బకాయిలు చెల్లించామన్నారు. చంద్రబాబు ప్రతి అడుగు మోసమని విమర్శించారు. ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

# ఇంటర్ మీడియట్ కు ప్రవేశాలు ప్రారంభం



**గుమ్మ లక్ష్మీపురం జూలై 15 పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు జరుగుతున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ మేరకు రవికుమార్ మాట్లాడుతూ, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశం వాడుకోవాలన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఈటీ గ్రూపులు ఉన్నాయని చెప్పారు. చేరిన వారికి ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకం వర్తిస్తాయని ఈ విషయాన్ని విద్యార్థి విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# 1/70 చట్టం ఆర్థిక వనరు కాదు.. గిరిజనుల మనుగడకు మూలాధారం



రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య

**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు/గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 15:** షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్--1/1970 (1/70 చట్టం) గిరిజనులకు కేవలం ఆర్థిక వనరు కాదని, వారి అస్తిత్వం, సంస్కృతి, జీవన విధానం, మనుగడకు మూలాధారమని ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ అరకు పార్లమెంట్--పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు. బుధవారం పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కొందరు గిరిజనేతరులు 1/70 చట్టం రాజ్యాంగంలోని పలు అధికరణలకు విరుద్ధమంటూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. గిరిజనుల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలకు ఈ పిటిషన్లు నిదర్శనమని ఆయన ఆరోపించారు. 1/70 చట్టం కారణంగానే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజన భూములు పరిరక్షితంగా ఉన్నాయని, ఈ చట్టాన్ని బలహీనపరిస్తే గిరిజనులతో పాటు సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలకూ తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూముల క్రయవిక్రయాలకు స్వేచ్ఛ కల్పిస్తే భూస్వామ్య, వాణిజ్య వర్గాల చేతుల్లో భూములు కేంద్రీకృతమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇప్పటికే పలుమార్లు 1/70 చట్టం రాజ్యాంగబద్ధతను సమర్థించిందని గుర్తు చేశారు. 1988లో పి. రామిరెడ్డి వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, 1997 సమతా కేసు, 2013 ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ కేసుల్లో గిరిజన భూముల రక్షణ అవసరాన్ని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని వివరించారు. గిరిజనులకు భూమి అనేది కేవలం ఆస్తి కాదని, వారి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, సామాజిక గుర్తింపు, ఆర్థిక మనుగడతో విడదీయరాని సంబంధం కలిగి ఉందని ఆయన తెలిపారు. రాజ్యాంగంలోని అయిదో షెడ్యూల్ లక్ష్యం కూడా గిరిజనుల భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను పరిరక్షించడమేనని పేర్కొన్నారు. జనాభా మార్పులను ఆధారంగా తీసుకుని గిరిజన రక్షణ చట్టాలను బలహీనపరచడం రాజ్యాంగ హామీలను నిర్వీర్యం చేసినట్లేనని అన్నారు. అలాగే 1/70 చట్టం బలహీనపడితే పెసా చట్టం--1996, అటవీ హక్కుల చట్టం--2006, గ్రామసభల అధికారాలు, గిరిజన స్వయం పాలన వ్యవస్థలపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి ఆదివాసీ ప్రజల హక్కుల ప్రకటన (2007), అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) కన్వెన్షన్--169 వంటి అంతర్జాతీయ ప్రమాణాలు కూడా ఆదివాసీల భూమి, సహజ వనరుల హక్కులను పరిరక్షించాలని స్పష్టంగా పేర్కొంటున్నాయని గంగులయ్య తెలిపారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ముందున్న వివాదం కేవలం భూమి హక్కుల అంశం కాదని, భారత రాజ్యాంగంలోని అయిదో షెడ్యూల్ భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశమని పేర్కొన్నారు. 1/70 చట్టం కాలం చెల్లినది కాదని, గిరిజనుల అస్తిత్వాన్ని కాపాడే రాజ్యాంగ రక్షణ కవచమని స్పష్టం చేశారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సుప్రీంకోర్టులో 1/70 చట్టం రాజ్యాంగబద్ధతను బలంగా సమర్థించాలని డాక్టర్ వంపూరు గంగులయ్య కోరారు.

## అరకులో 17న వైసిపి మహిళా ప్రజా ప్రతినిధుల సమావేశం



- అరకులోని "వి" రిసార్ట్‌లో ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు.
- ముంచంగిపుట్టు మండల వైసిపి అధ్యక్షుడు పాంగి పద్మారావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 15.** అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైఎస్ఆర్‌సీపీ మహిళా ప్రజాప్రతినిధులతో జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశం ఈ నెల 17న శుక్రవారం జరగనున్నట్లు వైసిపి మంచంగిపుట్టు మండలం అధ్యక్షుడు పాంగి పద్మారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అరకువ్యాలీ మండలం, పద్మపురం గ్రామ పంచాయతీ సమీపంలోని వి రిసార్ట్ ప్రాంగణంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్పర్సన్, ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జల్లిపల్లి సుభద్ర ఆధ్వర్యంలో మహిళ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, గౌరవ అతిధులుగా అల్లూరి జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, అరకు ఎంపీ గుమ్మా తనూజా రాణి, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీ వాణి, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శ్రావణి, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కొంతమంది మహిళ ప్రజా ప్రతినిధులు, వైసీపీ మహిళా నేతలు హాజరవుతారని నిర్వాహకులు తెలిపినట్లు పద్మ రావు వెల్లడించారు. పార్టీ బలోపేతం, మహిళా ప్రజాప్రతినిధుల సమస్యలు మరియు రాబోయే కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపినట్లు పద్మారావు పేర్కొన్నారు.

## సేబుగూడ పాఠశాలలో వంట మనిషే స్కూల్ టీచర్





- ఉపాధ్యాయ నియామకంపై చేతులెత్తేసిన విద్యాశాఖ.
- విద్యాశాఖపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు.
- శుక్రవారం పాడేరు గ్రీవెన్స్ కు వెళ్తామని వెల్లడి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 15.** ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక వంటమనిషే ఉపాధ్యాయునిగా కొనసాగుతూ పాఠశాలను నెట్టుకొస్తున్న దయానియ స్థితి ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో గల మాకవరం పంచాయతీ, సేబుగూడ గ్రామంలో గల ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో 55 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు లేక వంటమనిషే ఉపాధ్యాయునిగా పాఠశాల నడుపుతున్న దయనీయ పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు నైకం పరశురాం, గేమ్మెలి శ్రీనివాస్, వంతాల గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుపై గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయుడిని నియమించాలని మండల విద్యాశాఖ అధికారికి ఫోన్ ద్వారా సంప్రదించగా మండలంలో ఇప్పటికే కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని, ఇలాంటి పరిస్థితుల్లో తను ఏమి చేయలేకపోతున్నట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు అన్నారు. అయితే ఈ విషయంపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళుటకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని మండల విద్యాశాఖ అధికారి తెలిపినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. సేబుగూడలో ఉపాధ్యాయుని నియమించుటకు మండల విద్యాశాఖ అధికారులు చేతులెత్తేయటంతో శుక్రవారం పాడేరులో జరిగే ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వినతి పత్రాన్ని సమర్పిస్తామని తెలిపారు. పాఠశాల ప్రారంభంలో ఓ ఉపాధ్యాయురాలు పాఠశాల నడిపే వారని, ఆమె పదవి విరమణ చేయటంతో నేటికి సుమారు నెల రోజుల పాటు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితుల్లో వంటమనిషి పిల్లలను కూర్చోబెట్టి పాఠశాలను నడుపుతున్న దయనీయ పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వంతాల కొములు, నైకం గోపాల్, నైకం వాసుదేవ్, పరశురాం, బి అర్జున్ విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 30 ఏళ్ల ప్రజాసేవ... సమస్యలతోనే ప్రయాణం







- ఆరిలోవ ఎఫ్ ఆర్ యూ ఆసుపత్రికి నేటికీ 30 సంవత్సరాలు
- ఔట్ పేషెంట్ల్ ఫుల్ -సౌకర్యాలు నిల్
- ఎక్స్రే విభాగం ఉన్నా సిబ్బంది కొరత ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి
- నేడు 30వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఆరిలోవ ఎఫ్ ఆర్ యూ ఆసుపత్రి
- ఉద్యోగ భద్రత పై ఆందోళన, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి
- జీవీఎంసీ ఆధ్వర్యంలో హాస్పిటల్ నిర్వహణ కొనసాగాలి - సొసైటీల నిర్వహణ వద్దంటున్న ప్రజలు

**విశాఖ తూర్పు, పెన్ పవర్, జూలై 15** ఆరిలోవ పరిసర ప్రాంత వేలాదిమంది ప్రజలకు మూడు దశాబ్దాలకు సేవలను అందిస్తున్న ఆరిలోవ ఫస్ట్ రిఫెరల్ యూనిట్ ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి నేడు 30 సంవత్సరాల సేవను పూర్తి చేసుకుంటుంది. ఓ డి ఏ యు సి డి నిధులతో 1996 లో నిర్మించి ప్రారంభించిన అప్పటి మేయర్ సబ్బం హరి. ఆస్పత్రి ఒకప్పుడు జీవీఎంసీ ఆధ్వర్యంలో సమర్థవంతంగా సేవలను అందిస్తూ పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా నిలిచింది. ఎమర్జెన్సీ రాకపోకలకు అంబులెన్స్ సౌకర్యంతో పూర్తిస్థాయి హాస్పిటల్ గా సేవలందించింది
ప్రస్తుతం ఆసుపత్రి నిర్వహణ సొసైటీల ఆధ్వర్యంలో కొనసాగుతుంది నెలకు సుమారు లక్షల రూపాయలు వ్యయంతో నిర్వహణతో సాగుతున్నప్పటికీ ఉద్యోగుల భద్రత లేకపోవడం, సమయానికి వేతనాలు అందక సిబ్బందిలో ఆందోళన కారణమవుతుంది దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సొసైటీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని వారు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఎక్రే విభాగం ఉన్నప్పటికీ సిబ్బంది కొరత కారణంగా సేవలు అందుబాటులో లేకపోవడం రోగులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుంది. మందులు కొరతతో వైద్య సేవలపై ప్రభావం చూపిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
37 గా ప్రజలకు సేవలు అందించిన ఈ ఆసుపత్రి ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని వైద్యులు నర్సులు స్థానిక సాంకేతిక సిబ్బంది సహా అన్ని కార్యాలు తక్షణమే భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు సొసైటీ ఉద్యోగులను ఉద్యోగ భద్రత కల్పించి దీర్ఘకాలిక సేవలు అందిస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు. హాస్పిటల్ పరిసర ప్రాంతాలను అభివృద్ధిపరిచి సుందరీకరణ చేపట్టాలని, సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని మరమ్మతు గురైన గేట్లు రక్షణ గోడ, ఆసుపత్రిలో వివిధ విభాగాలు శిధిలవస్థకు చేరాయి ప్రధాన ద్వారం రోగులు కూర్చునేందుకు వీలుగా సదుపాయాలు కల్పించాలని, వాటిని మరమ్మతు చేయాలని, విద్యుత్ వ్యవస్థను ఆధునికరించాలని ప్రజలు కోరుతున్నారు., గతంలో మాదిరిగా ఆసుపత్రి నిర్వహణను తిరిగి జీవీఎంసీ ఆధ్వర్యంలో తీసుకుని వచ్చి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు మూడు దశాబ్దాల సేవ ప్రస్తావనాన్ని పూర్తి చేసుకున్న ఆరిలోవ ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి సమస్యలను అధిగమించి పూర్తిస్థాయి ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రిగా అభివృద్ధి చెందాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పిజిఆర్ఎస్ ఫిర్యాదు మేరకు ఎంఈఓ సందర్శించారు.



**గుమ్మలక్ష్మీపురం జూలై 15 పెన్ పవర్.** మండలంలో చింతలపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 శ్రీనివాసరావు బుధవారం నాడు సందర్శించారు. ఈ మేరకు ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు మధ్యాహ్న భోజన నిర్వాహకుల మార్పుపై గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని వారి నిర్ణయం మేరకు మహిళా సంఘాలనే కొనసాగిస్తామని స్పష్టం చేసామన్నారు. విద్యార్థులకు పెట్టే భోజనం మెనూ ప్రకారం ఉండాలి నాణ్యతగా లోపించకుండా ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎంపీటీసీ లక్ష్మణరావు, మాజీ బిజెపి ఎస్టి మోర్చా అధ్యక్షులు సింహాచలం, మహిళా సంఘాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి



- ఇందిర కోలనీలో దహన సంస్కారాలు నిర్వహణ.
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 15.** మండలంలోని కించాయిపుట్టు పంచాయితి, ఇందిరా కోలని గ్రామానికి చెందిన వెంగడ మహాలక్ష్మి (46) అనే ఉపాధ్యాయురాలు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. మహాలక్ష్మి పెందుర్తి మండలం గొల్లవాని పాలెం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. గత కొద్ది నెలలుగా అనారోగ్య బారినపడటంతో కుటుంబ సభ్యులు విశాఖపట్నం కెజిహెచ్ లో వైద్య సేవలకు తరలించారు. విశాఖ కేజీహెచ్ లో వైద్య సేవలు పొందుతూ మహాలక్ష్మి మంగళవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. తన సొంత గ్రామమైన ఇందిరా కాలనీ లో బుధవారం దహన సంస్కారాలు నిర్వహించారు. మహాలక్ష్మికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధ్యాయురాలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## మత్యగుండంలో జేబులకు గుండు కొడుతున్న దళారీలు.

- దర్శనం అంటే భయపడుతున్న భక్తులు.
- మొక్కు తీర్చుకుందాం అంటే జేబులు గుండు కొడుతున్న ఆలయ బ్రాహ్మణులు.



**హుకుంపేట పెన్ పవర్ జులై 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా. హుకుంపేట మండలం మత్యగుండంలో ఉన్న మహాశివ క్షేత్రంను . ప్రతిరోజు అనేకమంది భక్తులు. దర్శించుకుంటారు ఎక్కువమంది గిరిజనులు. పేద వారే అధికం. వివిధ దూర ప్రాంతాల నుంచి బస్సు సదుపాయాలు లేకపోయినప్పటికీ కాలినడకన దాదాపు 5 నుండి 6 కిలోమీటర్లు నడుచుకుంటూ ఈ క్షేత్రానికి చేరుకుంటారు. అనంతరం శివుని దర్శించుకుని అనేక రకాల మొక్కలను తలనీలాల రూపంలో శివునికి అర్పించుకుంటారు అయితే ఆలయబ్రాహ్మణులు. మొక్కు తీర్చుకునే వారికి అది ఏ విధమైన మొక్కు తెలుసుకొని దాదాపు 2000 నుంచి 4000 రూపాయలు వసూలు చేస్తున్నారని భక్తులు వాపోయారు ఇదిలా ఉండగా ఓ పార్టీకి చెందిన ప్రముఖ కార్యకర్త. కోటి బాబు. ఓ చిన్న బాబుకు కీడు మొక్కు అని మత్యగుండం వెళ్ళగా ఆలయ బ్రాహ్మణులు దాదాపు నాలుగు వేలు డిమాండ్ చేశారని వాపోయారు అయితే 2016 రూపాయలకు బేరం కుదుర్చుకుని గుండు గీయించుకునాను అని వాపోయారు. ఇది ముమ్మాటికి దేవుడు సాక్షిగా జేబుకు చిల్లేనని ఆయన వాపోయారు. ఇలా అయితే గిరిజన ప్రాంతంలో ఆలయాలకు రావాలంటే భక్తులు భయపడి పోతారని. దైవత్వానికి దూరం అయిపోతారని ఆయన వాపోయారు వెంటనే సంబంధిత ఆలయ కమిటీ వారు మరియు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు


## ముద్రగడ పద్మనాభం మరణం తీరని లోటు

**వైసీపీ నాయకులు అరికట్ల ఆంజనేయులు**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 15:** ప్రముఖ కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని గూడెం కొత్తవీధి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అరికట్ల ఆంజనేయులు పేర్కొన్నారు.బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కాపు సామాజిక వర్గ హక్కుల కోసం ముద్రగడ పద్మనాభం జీవితాంతం అహర్నిశలు పోరాడారని కొనియాడారు. ఆయన సేవలు, ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అరికట్ల ఆంజనేయులు(అంజి)ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు వారి కుటుంబానికి ప్రసాదించాలని ఆకాంక్షించారు.ముద్రగడ పద్మనాభం ఆశయాలు, ప్రజా సేవా భావం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

## 2026-27 విద్యా సంవత్సరానికి ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి, పెన్ పవర్,జూలై 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకుల రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు.ఉన్నత విద్య కమిషనర్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రస్తుతం ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు మాత్రమే ఈ రెన్యువల్ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన అధ్యాపకులు జూలై 18, 2026లోపు తమ తమ కళాశాలల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్లు స్వీకరించిన దరఖాస్తులను జూలై 20, 2026 సాయంత్రం 5 గంటలలోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు ప్రిన్సిపాల్‌కు పంపించాలని తెలిపారు.రెన్యువల్ ప్రక్రియలో భాగంగా జూలై 24, 2026న జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రెన్యువల్‌కు ఎంపికైన అధ్యాపకులు జూలై 25, 2026న ఒప్పంద పత్రం (అగ్రిమెంట్)పై సంతకం చేయాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు.

# అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి.

### బీమా, గ్రాట్యుటీ సదుపాయాలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ కల్పించాలని సీఐటీయూ డిమాండ్.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 15.** అల్లూరి సీతారామరాజు జిల్లా,చింతపల్లి మండలం, లోతుగడ్డ పంచాయతీ దోమలగొంది గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వానికేడి పార్వతమ్మ (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్న ఆమె, ఈనెల 14న రాత్రి సుమారు 7 గంటల సమయంలో కన్నుమూశారు.

ఇటీవల మినీ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న పార్వతమ్మను మెయిన్ అంగన్‌వాడీ టీచర్‌గా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన కొద్దికాలానికే ఆమె మృతి చెందడం అంగన్‌వాడీ సిబ్బందిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

మృతదేహానికి సీఐటీయూ, అంగన్‌వాడీ నాయకులు ప్రాజెక్ట్ లీడర్ పి పెంటమ్మ, సెక్టర్ లీడర్లు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పి. పెంటమ్మ మాట్లాడుతూ, మృతి చెందిన అంగన్వాడీ టీచర్ పార్వతమ్మకు ముగ్గురు పిల్లలు, భర్త ఉన్నారు అని అన్నారు. అంగన్వాడి టీచర్ మృతి చెందడంపై ఎటువంటి ఉపాధి లేక కుటుంబానికి దిక్కులేని పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు బీమా, గ్రాట్యుటీతో పాటు ఇతర సంక్షేమ సదుపాయాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సేవలో ఉండగానే మరణించిన అంగన్‌వాడీ సిబ్బంది కుటుంబాలకు తగిన ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సెక్టర్ లీడర్లు చెల్లయమ్మ, రాణి, వెంకటలక్ష్మి,తేజ, ప్రశాంతి, రాజేశ్వరి, పుష్ప,సుభద్ర, నాగరత్నం,సత్యవతి, శాంతి స్థానికులు పాల్గొన్నారు.

## కిముడు లక్ష్మయ్య పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం.

### చింతపల్లి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 15.** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కిముడు లక్ష్మయ్య పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచందర్రావు అన్నారు. బుధవారం ఆయన మృతికి సంతాపంగా స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలో మౌనం పాటిస్తూ ఆయనకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘన నివాళులర్పించాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకుడిగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడి న వ్యక్తి లక్ష్మయ్య అన్నారు. గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు ఆఖరి శ్వాస వరకు తనదైన ముద్రను వేశారన్నారు. లక్ష్మయ్య లేని లోటు పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పించడం ఆయన త్యాగనిరతికి మనం ఇచ్చే గౌరవం సూచికమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గెమ్మెలి అబ్బాయి నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చల్లంగి లక్ష్మణరావు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు రీమల ఆనందరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు చిన్న కాసిం వల్లి, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12 వ వార్డు ప్రజా సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి



- సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన పరిసరాలు పరిశుభ్రత పై అప్రమత్తం
- వీధి దీపాలు పారిశుధ్యం పై దృష్టి ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా
- వార్డు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 15:**జీవీఎంసీ 12 వ వార్డు పరిధిలో పలు ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు త్రాగునీరు వీధి దీపాలు పారిశుద్ధ్యం, కాలువలు రహదారుల అభివృద్ధికి కార్యచరణ చేపట్టామని, విడతల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు గుర్తించిన పనులను వెంటనే సమస్య పరిష్కరించడం జరుగుతుందని,వార్డు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు,వార్డు నాయకులు వార్డు పరిధిలో పర్యటిస్తున్నారని తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు తెలిపారు. శాసనసభ్యులు ఆదేశాలమేరకు బుధవారం 12 వార్డ్ దుర్గానగర్,నెహ్రూ నగర్,ప్రాంతాలలో కొద్దిరోజులుగా పేరుకుపోయిన వ్యర్థాల దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నరని, గుర్తించిన వార్డు అధ్యక్షులు పారిశుద్ధ్యకార్మికులతో పరిసర ప్రాంతాల శుభ్రపరిచి బ్లీచింగ్ చెల్లించారు. త్రాగునీటి సమస్యను గుర్తించి రెండు నీటిట్యాంకర్ల ద్వారా దుర్గానగర్ నెహ్రూ నగర్ మరియు అంబేద్కర్ న్యూ కాలనీ వాటర్ నీటిని అందజేశారు.ఇవ్వడం జరిగింది.క్లస్టర్ ఇంచార్జీ సత్యం.గణపతి,రవి, శాలరీ ఇన్స్పెక్టర్ అబ్దుల్ మీరా.బాల,లక్ష్మి,గోపల్లి రామక్రిష్ణ మరియు సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు

## 87వ వార్డు లో జోనల్ కమిషనర్ పర్యటన



**–వార్డు సమస్యలను వివరించిన మాజీ కార్పొరేటర్ జగన్**

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జూలై 15** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధిలో మాజీ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం ఆధ్వర్యంలో గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి నాయుడు సుడిగాలి పర్యటన చేశారు . ఓపెన్ షెడ్లు సామాజిక భవనాలు 87వ వార్డులో మంజూరయ్యాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు మేరకు జోనల్ కమిషనర్ స్వయంగా స్థల పరిశీలన చేయాలని అందులో భాగంగా నాయి బ్రాహ్మణ వీధిలో స్లాబ్ ఎక్స్టెన్షన్, దానప్ప తల్లి గుడి సమీపంలో మరియు కణితి అంబేద్కర్ కాలనీలో నిధుల కొరతతో నిలిచిపోయిన సామాజిక భవనాలు , కణితి గవర వీధిలో సామాజిక భవనం ఏర్పాటు కొరక స్థల పరిశీలన చేశారు . ఈ సందర్భంగా వార్డు మాజీ కార్పొరేటర్ బొండా జగన్నాథం మాట్లాడుతూ ఈ సమాజిక భవనాలు సంఘాలకు అవసరమని వీటికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్య విధంగా కృషి చేయాలని అధికారులను కోరారు. అధికారులు ఈ ఈ ఎంఆర్ఎఫ్ అప్పారావు,ఏ ఈ మహాలక్ష్మి,వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, జాన్ రమేష్, ఆదినారాయణ,సుందర సునీల్, కనక సత్యం, బొడ్డేటి దేవుళ్ళు, బి శ్రీకాంత్, రవి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు

## సీలేరు హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను వెంటనే ప్రారంభించాలి

- సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి
- పీసా ఉపాధ్యక్షుడు కిల్లో మనోజ్ కుమార్ డిమాండ్




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 15**: సీలేరు హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించి, బంక్‌ను వెంటనే పునఃప్రారంభించాలని పీసా ఉపాధ్యక్షుడు కిల్లో మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పది రోజులుగా సాంకేతిక లోపం కారణంగా సీలేరు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సేవలు నిలిచిపోయాయని తెలిపారు. దీంతో గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర సేవల వాహనాలు, సాధారణ వాహనదారులు ఇంధనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రధాన ఇంధన కేంద్రం పనిచేయకపోవడం వల్ల ప్రజలు సమయం, ధనం వృథా చేసుకోవాల్సి వస్తోందన్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాంకేతిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి పెట్రోల్ బంక్‌ను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టి గిరిజన ప్రాంత ప్రజలకు నిరంతర ఇంధన సరఫరా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

- సీఐ బి. సింహాచలం.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 15.** యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చింతపల్లి సిఐ బి. సింహాచలం అన్నారు. బుధవారం చింతపల్లి వారపు సంతలో మత్తు పదార్థాల అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి కి దూరంగా ఉండాలని, గంజాయి అనే పదం మనసులోంచి పూర్తిగా తొలగించుకోవాలన్నారు. గంజాయి పండించిన, రవాణా చేసిన, గంజాయి కలిగి ఉన్న వారిపై చట్టపరమైన కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. యువత గంజాయికి దూరంగా ఉండి ప్రత్యామ్నాయ మార్గాలను పెంచుకొని జీవితాలను సుగమనం చేసుకోవాలని హితవు పలికారు. అలాగే వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని అప్పుడే ప్రమాదవశాత్తు ఏదైనా విపత్తు సంభవించినప్పుడు భీమా వర్తించే అవకాశం ఉంటుందన్నారు. సరైన పత్రాలు లేకుండా శిరస్రానం ధరించకుండా అలాగే ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిపై కేసులు పెడతామన్నారు. యువత పోలీసులకు సహకరిస్తూ ముందుకు సాగాలని ఆయన కోరారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలను ప్రతి గ్రామంలోనూ మారుమూల ప్రాంతాల్లోనూ నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి వీరబాబు, ఈఎస్ఐ నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

# కనీస వేతనాల చట్ట సవరణకై ఈ నెల 30న చలో కలెక్టరేట్.

- మహా ధర్నాను కార్మికులందరూ జయప్రదం చేయాలి.
- సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 15.** కనీస వేతనాల చట్ట సవరణకై ఈ నెల 30న చేపట్టనున్న చలో కలెక్టరేట్ మహా ధర్నాను ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు టైం స్కేల్ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కార్మికులకు పెంచవలసిన కనీస వేతనాల జీతాలను ప్రభుత్వాలు తుంగలో తొక్కయని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెరగక కార్మికులు నిలువునా ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు చట్టపరంగా జరిగి ఉంటే ప్రతి కార్మికుడికి 26 వేల రూపాయల కనీసం వేతనం వచ్చి ఉండేదని అన్నారు. మనదేశంలోని మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ వంటి రాష్ట్రాలలో కనీస వేతనాలు కాకపోయినా చట్టాలు సవరించి ఎంతో కొంత జీతాలు పెంచడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కనీసం చట్ట సవరణ చేయడం సరి కాదు కదా జీతం పెంచడానికి కూడా సుముఖంగా లేదని వాపోయారు. ఇటువంటి పరిస్థితులలో లక్షలాదిమంది కార్మిక వర్గం తమ శ్రమని పణంగా పెడుతున్నప్పటికీ ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆయన మండిపడ్డారు.



కనీస వేతనాల చట్ట సవరణ చేసి ప్రతి కార్మికుడికి 26 వేల కనీస వేతనం ఇచ్చేంతవరకు పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతుందని హెచ్చరించారు. ఎక్కడ పనిచేసిన కార్మికుడైన ఈ నెల 30న చలో కలెక్టరేట్ ముట్టడికి కదం తొక్కుతూ కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టైం స్కేల్ కార్మికులు రాజులమ్మ, కాంట్రాక్ట్ కార్మికులు రాజేశ్వరి, రామచంద్రరావు, గుంట అర్జున్ మరియు కార్మికుల పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


# దొరబాబు వివాదంతో జనసేన పార్టీకి సంబంధం లేదు



**నర్సీపట్నం, పెన్ పవర్ (జూలై 15) :**వివేకానంద కాలేజ్ లో పెట్టుబడుల విషయమై ఎన్ ఎస్ జి దొరబాబు వివాదం జనసేన పార్టీకి సంబంధంలేని అంశమని విశాఖ జిల్లా రూరల్ జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి స్పష్టం చేశారు. గతకొద్ది రోజులుగా దొరబాబును జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడిగా చెబుతూ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పార్టీ పెద్దలు చెప్పిన విధంగానే నర్సీపట్నం నియోజకవర్గంలో జనసైనికులు నాయకులు పనిచేస్తున్నామన్నారు. కూటమి ధర్మంలో భాగంగా నర్సీపట్నంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి రాజాన సూర్యచంద్రకు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు సముచిత స్థానం ఇస్తున్నారని, నామినేటెడ్ పదవులలో కూడా భాగస్వామ్యం దక్కుతుందని వివరించారు. పార్టీతో సంబంధంలేని అంశాన్ని, పార్టీకి ముడిపెట్టి కొంతమంది మాట్లాడుతున్నారని, వీరంతా వైసిపి ట్రాప్ లో పడి, వారిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి అల్లాడు సురేష్ మాట్లాడుతూ వివేకానంద కాలేజ్ వివాదం అంశంలో దొరబాబు పై కేసు నమోదు కావడం పట్ల జనసేన పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. అంతర్గత విభేదాలు ఉంటే కూర్చొని పరిష్కరించుకోవాలి, కానీ రోడ్డెక్కి పార్టీ పరువు తీయడం సమంజసం కాదన్నారు. గత రెండు రోజులుగా పార్టీలోని కొంతమంది కార్యకర్తలు కూటమి నేతలపై చేసిన ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. పార్టీ జెండా ఎగురువేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న వారే, వైసీపీ ట్రాప్ లో పడి జెండాను చించేసే పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. పార్టీ పెద్దలు రాజాన సూర్యచంద్రను నియోజకవర్గం ఇన్చార్జిగా పార్టీ శ్రేణులకు పరిచయం చేశారని, అతని ఆదేశాల మేరకే పని చేయాలని సూచించారని, అదేవిధంగా నర్సీపట్నంలో పనిచేస్తున్నామని వివరించారు. కొంతమంది కార్యకర్తలు పార్టీ పదవుల విషయంలో గందరగోళం సృష్టించే పనిలో ఉన్నారని, పార్టీ శ్రేణులు ఎవరు ఆందోళన చెందవద్దని పిలుపునిచ్చారు. వాస్తవాలన్నీ పార్టీ అధిష్టానానికి చెప్పడం జరిగిందని, వారి నిర్ణయమే తమకు శిరోధార్యం అని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి పంచాడ హరినాథ్ పాల్గొన్నారు.

## ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి...!

ప్రజలకు సూచనలు అందిస్తున్న ఎస్సై కిషోర్ వర్మ



**కొయ్యూరు, పెన్ పవర్ జూలై 15:** ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ గిరిజనులకు అవగాహన కల్పించారు. మండలంలోని డౌనూరు మూలపేట పంచాయతీల సరిహద్దు గ్రామాలైన బచ్చింత, పాలమామిడి, ధారగెడ్డ గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కిషోర్ వర్మ గ్రామస్తులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళలపై జరిగే నేరాల నివారణ, అలాగే గంజాయి సాగు, గంజాయి రవాణా వల్ల కలిగే దుష్పరిణామాలు మరియు చట్టపరమైన శిక్షలు గురించి అవగాహన కల్పించారు.

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళల భద్రతకు సహకరించాలని, గంజాయి సాగు లేదా రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# గిరిజనుడా రా కదలిరా..! 17న జరిగే నిరసనకు పెద్ద తరలి రండి.





- 1/70 చట్టం జోలికొస్తే తీవ్ర పరిణామాలు తప్పవు.
- సర్ ప్రక్రియలో బాగంగా గిరిజనేతరులు ఓట్లను బదిలీ చేయాలి.
- రౌండ్ టేబుల్ సమావేశం లో వక్తలు స్పష్టీకరణ.

**హుకుంపేట పెన్ పవర్ జూలై 15 :**హుకుంపేట మండలం జులై 15 మండలకేంద్రం లో ఆదివాసి ఐక్య ప్రజా వేదిక రా... కదలిరా...బేనర్ తో,అంబేద్కర్ పార్కు ఆవరణ లో మండల పిసా పోరం,ఆదివాసి గిరిజన సంఘం, సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశం పెద్ద ఎత్తున నిర్వహించారు.

ఈ సమావేశానికి పిసా మండల అధ్యక్షులు సప్పాలి.శంకర్ అధ్యక్షత వహించగా,ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి టి క్రిష్ణరావు ప్రారంభ ఉపన్యాసం చేసారు,ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. 1/70 చట్టం పరిరక్షణ, జీఓ నెంబర్ 3కి ప్రత్యామ్నాయ ఆదివాసుల ప్రత్యేక ఉద్యోగ నియామకాల చట్టం సాధన, 17వ తేదీన పాడేరులో జరిగే బహిరంగ నిరసన కార్యక్రమం,విజయవంతం కోసం జనసమీకరణ సేకరణ మొదలగు ఉద్యమ అజెండాను రౌండ్ టేబుల్ సమావేశం ముందు ఉంచి వీటిపై చర్చ జరగాలని సూచించారు.

ఈ సమావేశానికి పాల్గొన్న తెలుగు దేశం పార్టీ నాయకులు, డీఎల్ఓ నాయకులు తడిగిరి సర్పంచ్ పి రంజిత్ కుమార్,వైసీపీ నాయకులు బిరవిప్రసాద్, టి సురేష్ , మానవ హక్కుల నాయకులు ఎస్ సూర్యనారాయణ, సంయుక్తంగా మాట్లాడుతూ 1/70 చట్టం అనేకమంది ఆదివాసి పోరాట యోధుల త్యాగాలతో సిద్ధించిన చట్టం అన్నారు.అది సంపుణంగా అమలు కావాలంటే అది ఉద్యమాల్తోటే సాధ్యం అన్నారు.మానపంతంలో బ్రతుదేరువుకి వచ్చిన గిరిజనేతరులు 1/70చట్టాన్ని రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడం దుర్మార్గమైన చర్చ అన్నారు. వారిని తక్షణమే ఆదివాసి ప్రాంతం నుండి వెళ్లగొట్టాలని వారు మండిపడ్డారు. వారు అక్రమంగా నిర్మించుకున్న నిర్మాణాలను ప్రభుత్వం తొలగించాలన్నారు. అనంతరం అంబేద్కర్ పార్కు నుండి రెవెన్యు కార్యాలయానికి వెళ్లి,అక్రమ నిర్మాణదారులపైనా,ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని, సర్ ప్రక్రియలో బాగంగా వారీ ఓట్లను వారి ప్రాంతాలకు బదిలీ చేయాలని,వలసవాదులకు ఓట్లనమోదు చేయడానికి వీల్లేదని స్తానిక తహసీల్దార్ సమస్యలతో కూడిన వినతి పత్రం. అందజేశారు.

ఈ కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి వి లక్ష్మణరావు,గిరిజన మహిళా సంఘం నాయకులు ఎస్ హైమావతి,వైసీపీ నాయకులు హుకుంపేట మాజీ సర్పంచ్ వెంకట్,కొంతిలి సర్పంచ్ రమేష్ పూర్ణిమ,రవిప్రసాద్,తెలుగుదేశం పార్టీ నాయకులు కామేష్,16పంచాయతీలకు చెందిన పిసా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పెద్దఎత్తున ఆదివాసులు పాల్గొన్నారు.

# 65 వార్డ్ లో ఎస్ ఐ ఆర్ పై టిడిపి సమీక్షా సమావేశం
# వార్డ్ లో సంబంధంలేని వ్యక్తుల పెత్తనం సహించం : మంగ

**గాజువాక :పెన్ పవర్ ,జులై 15** జీవీయంసి 65 వార్డ్ లో ఎస్ ఐ ఆర్ పై టిడిపి సమీక్ష సమావేశం నిర్వహించింది . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వార్డు మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు పాల్గొని జులై 24 వరకు గడువు పెంచారని , ఏపి టిడిపి అధ్యక్షుడు , ఎం ఎల్ ఏ .పల్లా శ్రీనివాసులు రావు ఆదేశాల మేరకు 65వ వార్డ్ అధ్యక్షులు రట్టి వాసు అధ్యక్షతన వార్డు రాజీవ్ ఇండోర్ స్టేడియంలో క్యాడర్ మీటింగ్ మరియు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు . బి ఎల్ ఓ ఏజెంట్లతో కలిసి బిఎల్ఏ ఏజెంట్లు చురుగ్గా పాల్గొని అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు పోవడానికి వీల్లేదని పిలుపునిచ్చారు . వార్డ్ ముఖ్య నాయకులు ఇంచార్జ్ బై పిల్లి గాంధీ, క్లస్టర్ ఇంచార్జ్ దాట్ల శ్రీనివాసు, వార్డు ఉపాధ్యక్షుడు పార్టీ బల్ల శివ శాస్త్రి, సింగంపల్లి దేవుడు, వార్డు వెలమ సంఘ అధ్యక్షుడు నక్క భాస్కరరావు, వార్డు సీనియర్ నాయకుడు జగదీష్, మహిళా అధ్యక్షురాలు కోరుకొండ మంగ మాట్లాడుతూ వార్డ్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామంటూ పక్కవార్డు లో వారు వచ్చి అంతర్గ విభేదాలు పెట్టాలనుకుంటే చూస్తూ ఉండమని పార్టీ బలోపేతానికి



పనిచేయాలని , అభివృద్ధిలో దూసుకెళ్లాలి తప్ప వార్డులో వచ్చి పెత్తనం చేస్తాం అంటే ఊరుకోం జాగ్రత్త అంటూ హెచ్చరించారు . కార్యక్రమంలో శివంగి నాగేశ్వరరావు, రేఖ సత్తిబాబు, కొయ్య గురుమూర్తి, కంచిపాటి అప్పలరాజు ,చౌడువాడ చిన్న, శుక్లా కామేష్, రట్టి సంతోష్, నాగరాజు, జగదీష్, చిట్టిబాబు, కులపాక సతీష, మహిళా కార్యదర్శి కొట్టి శ్రీలక్ష్మి, జయంతి చౌదరి, గోకిన జయ, పెమ్మి పద్మ, సంధ్య, భూత్ ఇన్చార్జులు ,వార్డ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'అభయ' అవగాహన కార్యక్రమం...




## విద్యార్థినులు, మహిళల భద్రతపై అవగాహన...
## ఫిర్యాదుల కోసం కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు...
## స్థానిక ఎస్సై వై. తారకేశ్వరరావు...

**నాతవరం, జూలై 15 (న్యూస్ 19):** విద్యార్థినులు, మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'అభయ' (ూఎష్ట్ఝుఝు) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై వై. తారకేశ్వరరావు మాట్లాడుతూ, మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే వేధింపులు, సమస్యలపై ఎలాంటి భయం లేకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం పొందే విధానం, ఫిర్యాదు చేసే హక్కు, అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో అభయ అవగాహన పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు, విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేయడానికి కంప్లైంట్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించి చట్టపరమైన రక్షణను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట పంట రైతాంగానికి ఎంతో మేలు...!

మండల వ్యవసాయ అధికారి" పి.శివరాం ప్రసాద్"



**కొయ్యూరు, పెన్ పవర్ జులై 15:** వ్యవసాయ రైతాంగం పచ్చిరొట్ట పంట తో యూరియా వినియోగాన్ని తగ్గించుకొని అధిక దిగుబడిలో సాధించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి బి శివరాం ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలో కొండ గొకిరి, పాడి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వరి నర్సరీలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు అలాగే ఈ ఏడాది చిరుధాన్యాలు రాగి సాగుపై ప్రత్యేకంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులు యూరియా డిఎపి తీసుకొనే విధానం గురించి కూడా వివరించారు. ప్రతి రైతు పంట నమోదు ను గ్రామ సహాయ వ్యవసాయ అధికారి లేదా ఉద్యాన అధికారి ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం లేదా ప్రకృతి వ్యవసాయం పద్ధతులు అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈవో మాధవి మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చులి మంగతల్లి కొండ గొకిరి మాజీ సర్పంచ్ ముసిలినాయుడు వ్యవసాయ రైతులు పాల్గొన్నారుం

## అభివృద్ధి సంక్షేమం ప్రజల్లోకి తీసుకెళ్లాల చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షులు వంతల కొండలరావు



**జి.మాడుగుల. పెన్ పవర్. జులై(15)** ఈరోజు మండల తెలుగుదేశం పార్టీ సమావేశం స్థానిక జడ్పీ గెస్ట్ హౌస్ వద్ద మండల పార్టీ అధ్యక్షులు వంతల కొండలరావు అధ్యక్షతన

జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర జిసిసి డైరెక్టర్,మాజీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అలాగే మరియొక అతిథి రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సోమేల చిట్టిబాబు లు మాట్లాడుతూ ప్రతినెల మండల పార్టీ సమావేశాలకు ప్రతి ఒక్క కార్యకర్త హాజరై కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమం ను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని అలాగే ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు కార్యకర్తలకు అభినందనలు తెలిపారు అలాగే రాబోయే స్థానిక ఎన్నికల్లో మండలంలో గల అన్ని సర్పంచ్ స్థానాలు, ఎంపీటీసీ సెగ్మెంట్లు, జడ్పిటిసి ఎంపీపీ వార్డు సభ్యులు అన్ని పదవులు తెలుగుదేశం కూటమి అభ్యర్థుల కైవసానికి సాయి శక్తుల కృషి చేయాలని వైసిపి పార్టీ చేస్తున్న నిరాధారణ ఆరోపణలను తిప్పి కొట్టాలని అంతేకాకుండా మండలంలో రైతులకు విత్తనాలు ఎరువులు రసాయనాలు మందులు సక్రమంగా అందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పిఏసిఎస్ డైరెక్టర్ కిముడు కళ్యాణం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్. నాగబ్బాయి, ప్రధాన కార్యదర్శి బొంజుబాబు, వి. కృష్ణ మూర్తి, క్లస్టర్లు వి. చిరంజీవి నాయుడు,కె. శ్రీనివాస్ నాయుడు, సీనియర్ నాయకులు ఎల్ బాలయ్య దొర, పి.బీమ్ బాబు,పి. భాస్కర్ రావు, ఎం. లక్ష్మణరావు,కె.రమేష్, కొండబాబు చిట్టి నాయుడు,మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక ఆత్మహత్య!



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ జూలై 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని జెర్రీల పంచాయతీ నిట్టమామిడిపాలెంలో ఓ మైనర్ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కె. మేరీ (16) చింతపల్లిలోని అమరావతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చదువుతోంది. కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న గూడెం కొత్త వీధి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.ఈ విషయమై గూడెం కొత్త వీధి ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# పల్లె బాటలో ఈగల్ టీం పోలీస్ శాఖ



**జి.మాడుగుల.పెన్ పవర్. జులై(15)** జి మాడుగుల మండలం సల్మరంగి గ్రామంలో నేడు ఈగల్ టీం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులతో గంజాయి పంట పండిస్తే వచ్చే అనర్థాలు గురించి జరగబోయే పరిణామాలు గురించి వివరిస్తూ సీజన్లకు తగిన ప్రత్యామ్నాయ పంటలను చేసుకోవాలని యువత గంజాయి జోలికి పోవద్దని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈగల్ టీం మరి జి.మాడుగుల పోలీస్ శాఖ పాల్గొన్నారు

# ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

- పెదగూడ, ఏనుగురాయి పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం.
- మండల వ్యవసాయ శాఖ అధికారి జి మురళి కృష్ణ.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 15.**మండల పరిధిలో గల పెదగూడ ఏనుగురాయి పంచాయితిలా గ్రామాల్లో రైతులకు "పొలం పిలుస్తుంది"కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి జి మురళి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ నీటీతో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రతి మంగళ బుధవారాల్లో రైతులు పొలాలను సందర్శించి రైతులకి అధిక దిగుబడులు ఇచ్చే పంటల సాగుపై పొలం పిలుస్తుంది ద్వారా పలు సూచనలు సలహాలు అందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సంవత్సరం మనకి ఎల్ నీ నో ప్రభావంతో కొంత మేర వర్షాలు తగ్గే సూచనలు ఉన్న నేపథ్యంలో రైతులు చిన్న చిన్న వర్షాలకు నీటీని కుంటల్లో నిల్వ చేసుకుని వరి నారుమడులకు నాట్లు వేసేటప్పుడు జాగ్రత్తగా ఆ నీటిని వినియోగించు కోవాలన్నారు. వరి పంటకు ఎక్కువ నీరు అవసరం కనుక వరికి బదులు ఆరుతడి పంటలు తక్కువ నీటితో పండే రాగులు, సామలు, జొన్నలు వంటివి సాగు చేసుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా కాఫీ, మిరియాలు, కూరగాయలు అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటల వైపు గిరిజన రైతులు దృష్టి సారిస్తే అదిక లాభాలు సాధించవచ్చని ఆయన సూచించారు. తక్కువ వర్షంతో ఎక్కువ దిగుబడిని ఇచ్చే పసుపు, పిప్పళ్లు వంటివి అధికంగా వేసుకోవాలన్నారు. వీటిని ప్రకృతి వ్యవసాయం పద్ధతి ద్వారా ఆవు మూత్రం ఆవు పేడతో గతం తయారు చేసుకొని పొలానికి చల్లాలన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం సూక్ష్మ జీవుల పెరుగుదలకు ఉపయోగ పడతాయని, మొక్కకి కావలసిన సూక్ష్మ పదార్థాలు అందచేసి అధిక దిగుబడులు సాధించవచ్చునని మురళి కృష్ణ ఆయా పంచాయతీ గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ ఏ పెంటన్న, పుణ్యవతి కాఫీ లైజన్ వర్కర్స్ ఈఓ ఈ శ్రీరాములు, జగన్నాథం, వెంకటస్వామి ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది హరి ప్రసాద్, మన్మథ, రైతులు పాల్గొన్నారు.

# సామాజిక మరుగుదొడ్లను ప్రారంభించండి.



**గుమ్మలక్ష్మీపురం జూలై 15 పెన్ పవర్.**మండలంలో గల ఎల్విన్ పేట జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన సామాజిక మరుగుదొడ్లను ప్రారంభించాలనిస్థానికులు కోరుతున్నారు.ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, పాఠశాలలు,కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో వీటిని అందుబాటులోకి తెస్తే విద్యార్థినులు,మహిళా ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక మండలం కావడంతో నిత్యం ప్రజలు ఆఫీస్ పనుల నిమిత్తం వస్తూ ఉంటారని స్థానికులకు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్మాణం పూర్తయినా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానికుల ఆవేదాన్ని గుర్తించి మరుగుదొడ్లను త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నామన్నారు.

# విద్య జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే గొప్ప సాధనం...!

- విద్యార్థునులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్" బి శ్రీనివాసరావు"



**కొయ్యూరు, పెన్ పవర్ జులై 15:** విద్యార్థినులు నేటి సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం రాజేంద్రపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ... బాలికలు భద్రత వ్యక్తిగత వికాసం సైబర్ నేరాలు నివారణ మహిళలు చట్టపరమైన హక్కులు ఆరోగ్యం రోడ్డు భద్రత అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్య జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే గొప్ప సాధనమని అన్నారు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలను ఆచరిస్తూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అలాగే మంచి స్పర్శ చెడు స్పర్శ పై వివరించి ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన లేదా అసౌకర్యానికి గురిచేసిన మౌనంగా ఉండకుండా వెంటనే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. ట్రైబల్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియా ద్వారా పరిచయమైన అపరిచితులను వారికి వ్యక్తిగత వివరాలు ఫోటోలు పాస్వర్డ్ ఎవరికి పంపవద్దని అన్నారు ముఖ్యంగా ఆన్లైన్ గేమ్స్ షేక్ లింకులు సైబర్ మోసాల వల్ల కలిగే అబద్ధాలు గురించి వివరించారు. ఎటువంటి అనుమానస్పద ఘటన జరిగిన వెంటనే 19 30 సైబర్ హెల్ప్ లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్కు సంప్రదించాలని కోరారు. అలాగే బాల్య వివాహాలు చెత్త విరుద్ధమని 18 సంవత్సరాల లోపు వివాహం చేసుకోవడం లేదా చేయించడం నేరమని అన్నారు. ప్రతి బాలిక తన చదువును పూర్తి చేసి స్వయం సమృద్ధి సాధించి సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన శక్తి ఆప్ అలాగే 112 అత్యవసర సేవలు 181 మహిళల హెల్ప్ లైన్ 10 98 చైల్డ్ హెల్ప్ లైన్ సేవలను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని తెలియజేశారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం నిర్లక్ష్యంగా రోడ్డు దాటడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మంచి నడవడి క్రమశిక్షణ దేశభక్తి సామాజిక బాధ్యతను అలవర్చుకొని కుటుంబానికి పాఠశాలలకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సీఐ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

# నవోదయ విద్యాలయంలో నాణ్యమైన విద్యతో పోటీ పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దాలి






కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ/పెద్దాపురం, పెన్ పవర్, జూలై 15:** జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోటీ పరీక్షలకు సమర్థవంతమైన శిక్షణ అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశానికి చైర్మన్ హోదాలో హాజరైన ఆయన, ఎన్సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించి సమావేశంలో పాల్గొన్నారు.విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.సి.కీర్తి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాలయ పురోగతి, విద్యార్థుల ప్రతిభ, నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించగా, వాటిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని, విద్యార్థులను ఉన్నత లక్ష్యాల సాధన దిశగా తీర్చిదిద్దాలని సూచించారు. తల్లిదండ్రుల ప్రతినిధులతో విద్యాలయ పనితీరుపై చర్చించి, విద్యార్థులతో మమేకమై అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు.

ఈ సందర్భంగా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ప్రియా ఐఏఎస్ మాట్లాడుతూ బట్టీ విధానానికి బదులుగా అవగాహనతో కూడిన అభ్యాసంపై దృష్టి పెట్టాలని, పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ పి.రమేష్,జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, ఆర్అండ్బీ అధికారులు, ఎం.ఆర్.కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, తల్లిదండ్రుల ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ముద్రగడ మృతి పట్ల కత్తిపూడి గ్రామంలో స్వచ్ఛంగా బంద్ ప్రకటించిన గ్రామస్తులు...



**శంఖవరం పెన్ పవర్ జులై 15:-** శంఖవరం మండలం కత్తిపూడిలో అకాల మరణం చెందిన ఉద్యమనేత, మాజీ మంత్రి, సీనియర్ వైస్సార్సీపి సీనియర్ నాయకులు ముద్రగడ పద్మనాభం అశ్రు నివాళులు అర్పిస్తూ, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో ఈరోజు కత్తిపూడిలో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, షాపులకు బంద్ పిలుపునిచ్చిన వైస్సార్సీపీ శ్రేణులు. అయన మృతిపట్ల, గ్రామంలో ముద్రగడకు ఉన్న అనుబందాన్ని గుర్తు చేసుకుంటూ గ్రాములో పలువురు నివాళులు అర్పించడం జరిగింది. గ్రామస్తులు, వ్యాపారులు, విద్యాసంస్థలు బంద్ పాటించి ఆయన మృతి పట్ల మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడపా సోమేష్, గౌతు వాసు, జీలకర్ర లక్ష్మణ్, మాదేపల్లి మహేష్, తోటాడ సన్నీ, కొల్లా చిన్నా, దేవర కిషోర్, నాని, కృష్ణారావు దుర్గ, వైస్సార్సీపి శ్రేణులు పాల్గొన్నారు

# ముద్రగడ పద్మనాభంకు కోలంక గ్రామ ప్రజల ఘన నివాళి



**కాజులూరు, పెన్ పవర్, జూలై 15:** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతికి కాజులూరు మండలం కోలంక గ్రామ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీకి మారు పేరుగా నిలిచి, నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం చేసిన మహానాయకుడిగా, తన సొంత ఆస్తులను ప్రజా సేవకు వెచ్చించి పేద ప్రజలకు అండగా నిలిచిన గొప్ప వ్యక్తిగా ఆయనను కొనియాడారు. ముద్రగడ పద్మనాభం చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# బార్లపూడి క్రాంతిని అడ్డుకున్న ముద్రగడ అభిమానులు.

-నీవల్లే ముద్రగడ చనిపోయారని క్రాంతి పై ఆరోపణలు గుప్పించిన అభిమానులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 15:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె, బార్లపూడి క్రాంతిని ముద్రగడ అభిమానులు అడ్డుకున్నారు. తన తండ్రిని కడసారి చూపు చూసేందుకు వచ్చిన బార్లపూడి క్రాంతి పై ముద్రగడ అభిమానులు విరుసుకు పడ్డారు. తమ అభిమాన నాయకుడు ముద్రగడ పద్మనాభం నీ వల్లే మానసికంగా కృంగిపోయి మృతి చెందారని తక్షణమే ఇక్కడినుండి వెళ్లిపోవాలని నినాదాలు చేశారు. గేటు వద్ద అడ్డుకున్న క్రాంతి ముద్రగడ పార్దేవ దేహం వరకు వచ్చి బోరున విలపించారు. ముద్రగడ కుటుంబ సభ్యులు కూడా క్రాంతిని వెళ్లిపోవాలని ఆజ్ఞాపించడంతో క్రాంతి అక్కడినుండి బోరున విలపిస్తూ పోలీసుల సహాయంతో బయటికి వచ్చేసారు. దీంతో అక్కడ కొద్ది బుద్ధ వాతావరణం చోటు చేసుకున్నప్పటికీ క్రాంతి వెను తిరగడంతో వివాదం సద్దుమడిగింది.

# విలువలతో కూడిన రాజకీయ నాయకుడు ముద్రగడ.



-ఆయన మృతి రాష్ట్రానికి తీరని లోటు.

-రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై15:** విలువలతో కూడిన గొప్ప ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అని ఆయన మృతి వారి కుటుంబ సభ్యులకే కాకుండా, రాష్ట్రానికి ఎంతో తీరనిలోటని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు.బుధవారం ఉదయం కిర్లంపూడి చేరుకుని ముద్రగడ పార్థివ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయం ముద్రగడ జీవితం ఆదర్శ రాజకీయానికి నిదర్శనమన్నారు .పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసిన నాయకుడు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారన్నారు.ఆయన వెంట కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు, ప్రత్తిపాడు మండలం బిజెపి అధ్యక్షులు ఊట వీరబాబు, బిజెపి సీనియర్ నాయకులు అల్లు శివరామకృష్ణ, తోట గోపి,పెంటకోట సత్యనారాయణ, కంటా కాశీ విశ్వనాథం, దొడ్డ అప్పారావు, కోనేటి శ్రీనివాసరావు, పసుపులేటి సత్తిబాబు నైదాన రవి, తదితరులు ఉన్నారు.


# ఆదిత్యలో మొదటి సంవత్సర పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం







**గండేపల్లి, పెన్ పవర్, జూలై, 15:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యప్రాంగణంలో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సర విద్యార్థులకు నేటి నుండి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థి తల్లితండ్రుల సమావేశంలో ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యాన్ని లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసలుకోవాలి అన్నారు. ఆదిత్య పై అపార నమ్మకంతో తమ చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ విద్యార్థి ఉన్నతికి ఆదిత్య యాజమాన్యం ఎల్లవేళలా కృషి సల్పుతుందని అయితే తల్లితండ్రులుగా మీ వంతు సహకారం ఆదిత్య కు అందిస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం ఎంతో సులభం అని విద్యారుల తల్లితండ్రులు తమతమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తరచు కళాశాలకు వచ్చి వారి యొక్క విద్యా హాజరు తదితర సమాచారం తెలుసుకోవాలని పాలిటెక్నక్ విద్యార్థులు అధిక శాతం దిగువ మధ్యతరగతి కి చెందిన వారు కావున విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా చదువుకుంటే ఉన్నత శిఖరాలు చేరుకోవడం పెద్ద కష్టం కాదు అని మంచి కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం తో మీ చిన్నారులను తీర్చిదిద్దటానికి మీరు మేము కలిసి ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థి యొక్క నియమావళి ఆదిత్య యొక్క నిబంధనలు హాజరు యొక్క ప్రాముఖ్యత వారాంతపు నెలవారీ పరీక్షల వివరాలు తదితర విషయాలను గురించి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఎస్.టి.వి.ఎస్.కుమార్ తెలిపారు. ఆదిత్యలో తమ విద్యార్థులకు ప్రవేశం లభించడం ఆనందదాయకం అని విద్యార్థుల తల్లితండ్రులు అన్నారు. ఈ సమావేశంలో కళాశాల డీన్ . మాధవరావు. వివిధ విభాగాల అధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. డా. సిహెచ్ మురళీకృష్ణ గారి ప్రసంగం సభికులను ఎంతగానో ఆకట్టుకుంది




# మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

కీలక తీర్మానాలు ఆమోదించిన మండల అధ్యక్షులు పోతుల మోహన్ రావు



**గండేపల్లి, పెన్ పవర్, జూలై ,15:**గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు అధ్యక్షతన గండేపల్లి మండల టిడిపి కార్యాలయంలో నెలవారీ మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

సమావేశంలో ఆమోదించిన ముఖ్య తీర్మానాలు

నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో, అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ సహకారంతో నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తీర్మానించడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా మండల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

పోలవరం – అమరావతి

రాష్ట్ర అభివృద్ధికి చిహ్నాలుగా ఉన్న పోలవరం ప్రాజెక్టు పనులు, అమరావతి రాజధాని నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, దీనికి మండల పార్టీ పూర్తి మద్దతు తెలియజేస్తూ తీర్మానం చేశారు.

2047 లక్ష్యం

2047 నాటికి వికసిత రాష్ట్రంగా, వికసిత భారత్ గా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలకు గండేపల్లి మండలం నుండి అన్ని విధాలా సహకారం అందిస్తామని తీర్మానించారు.

పార్టీ బలోపేతశీ

బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేసి, ప్రతి ఇంటికి టీడీపీ విధానాలు, ప్రభుత్వ పథకాలు తీసుకెళ్లేందుకు కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో మండలంలోని అన్ని స్థానాల్లో సైకిల్ జెండా ఎగరేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

పోతుల మోహనరావు మాట్లాడుతూ

జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. చంద్రబాబు విజన్, పవన్ కళ్యాణ్ ప్రజా పక్షపాతం వల్లనే రాష్ట్రంలో మార్పు కనిపిస్తుంది. ప్రతి కార్యకర్త ప్రజల్లో ఉండి ప్రభుత్వ మంచి పనులు వివరించాలి" అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అడబాల భాస్కరరావు, కంటిపూడి సత్యనారాయణ,జాస్తి వసంత్, బొల్లం రెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశి, గొల్లవిల్లి అన్నవరం, కాటేపల్లి భద్రం, మైలవరపు శ్రీను, అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యమ నేత ముద్రగడకు జోహార్లు అర్పించిన కాపు సంఘ నాయకులు



**జగ్గంపేట, పెన్ పవర్, 15:** కాపుల రిజర్వేషన్ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహానుభావులు ముద్రగడ పద్మనాభం అని జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు దవులూరి ఈశ్వర్ రావు అన్నారు. బుధవారం గోకవరం రోడ్డులో కాపు సంక్షేమ సంఘం భవనం వద్ద స్వర్గీయ ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు మారిశెట్టి రాధా తదితర నాయకులు మాట్లాడుతూ మెట్ట ప్రాంతపు మేటి నాయకుడు ముద్రగడ పద్మనాభం అని, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పనిచేసిన గొప్ప నాయకుడు అని , కాపులకు రిజర్వేషన్ కోసం నిరంతరం శ్రమించి తన జీవితాన్నే త్యాగం చేసిన మహాను భావు డని వారి హఠాత్తు మరణం తీవ్రంగా కలిగించిందని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో తోట బుచ్చిరాజు, రాయి సాయి, ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్యనారాయణ, సహ కార్యదర్శి కురుమెళ్ళ నాగేశ్వరరావు, కోశాధికారి మసకపల్లి భైరవ స్వామి, సహ కోశాధికారి పుర్రె సూరన్న, శిరిబోలు గోవిందు, అడపా శ్రీను, కూనపురెడ్డి చిన్ని, కోడూరు రమేష్, తోట బుల్లబ్బాయి, సేనాపతి వెంకట్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి



- స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి
- టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం పిలుపు

**రామచంద్రపురం, జూలై 15 ,పెన్ పవర్:** రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఉండవెల్లి శివ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పొడిగించిన నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడం పార్టీ నాయకులు, కార్యకర్తల బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు అవసరమైన మార్పులు,చేర్పులు, తొలగింపుల ప్రక్రియను కూడా పూర్తిచేయాలని సూచించారు.రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజారంజక పాలన అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో రామచంద్రపురం పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, వాటి వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలని పార్టీ శ్రేణులకు వాసంశెట్టి సత్యం సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్లస్టర్, కో-క్లస్టర్,యూనిట్,బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో క్లస్టర్--1 ఇన్‌చార్జి మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్--2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు,కవల నానాజీ, సలాది నాయుడు,పదం మూర్తి, ఏలూరు ఏసుదాసు,గడి గోవింద్, నారపురెడ్డి బలరాం,జాస్తి విజయలక్ష్మి, బల్ల లక్ష్మి, మేడిశెట్టి మహాలక్ష్మి, వినోద్ చౌదరి, గడి జగన్‌తో పాటు క్లస్టర్,కో-క్లస్టర్,యూనిట్,బూత్ ఇన్‌చార్జిలు,వార్డు అధ్యక్షులు,కమిటీ సభ్యులు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దారపల్లి వాటర్ ఫాల్స్ ఘర్షణ





**మాజీ కౌన్సిలర్ భర్త హత్య**

**కాకినాడ/గొల్లప్రోలు, పెన్ పవర్, జూలై 15:** దారపల్లి వాటర్ ఫాల్స్ వద్ద జరిగిన ఘర్షణ గొల్లప్రోలులో హత్యకు దారితీసింది.గొల్లప్రోలు నగర పంచాయతీ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ భర్త లింగం అర్జునుడు (అర్జున్)ను బచ్చల మారుతి పవన్ అలియాస్ కళ్యాణ్ కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది.

పోలీసుల వివరాల ప్రకారం,జూలై 14న దారపల్లి వాటర్ ఫాల్స్‌కు వెళ్లిన సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం సాయంత్రం మరోసారి ఘర్షణ చోటుచేసుకోగా స్నేహితులు వారిని సముదాయించారు. అయితే పగ పెంచుకున్న నిందితుడు క్షమాపణ చెప్పే నెపంతో అర్జునుడు ఇంటికి వెళ్లి తన వెంట తీసుకెళ్లిన పదునైన కత్తితో కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అర్జునుడిని పిఠాపురంలోని కార్తికేయ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 10.45 గంటలకు మృతి చెందాడు.

ఈ ఘటనపై గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.112/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సంబంధిత సెక్షన్ల కింద హత్య కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టగా, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పిఠాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


# ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**హెలిప్యాడ్, సభా ప్రాంగణ పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్**



**గంగవరం /రంపచోడవరం,పెన్ పవర్ జూలై 15 :**రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టిన ముందస్తు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం రంపచోడవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అలాగే స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేపడుతున్నారని చెప్పారు. హెలిప్యాడ్ నిర్మాణం, సభా ప్రాంగణం, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.పర్యటనకు సంబంధించిన అధికారిక అనుమతులు వచ్చిన వెంటనే కార్యక్రమ వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఎలాంటి లోపాలకు తావు లేకుండా ప్రతి ఏర్పాటును పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, తహసీల్దార్ సి.హెచ్. బాలాజీ, కార్యనిర్వాహక ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ భవాని, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ కోనసీమ జిల్లా ఐచీ సెల్ కన్వీనర్‌గా వీర్నాల రమణ బాబు



**పెన్ పవర్ రావులపాలెం, జూలై 15:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓబీసీ మోర్చా పరిధిలోని ఐచీ (సంచార జాతులు) సెల్ కన్వీనర్‌గా రావులపాలెం గ్రామానికి చెందిన వీర్నాల రమణ బాబు నియమితులయ్యారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్ ఆయనకు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వీర్నాల రమణ బాబు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంటభుక్తం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పసుపులేటి మహాలక్ష్మి రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న సంచార జాతుల (ఐచీ) ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజాసేవే లక్ష్యంగా నిబద్ధతతో, పారదర్శకంగా తన బాధ్యతలను నిర్వహిస్తానని పేర్కొన్నారు.

## ఉన్నత పాఠశాలలకు సౌండ్ సిస్టమ్స్ బహూకరణ



**అల్లవరం, పెన్ పవర్, జూలై 15:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోడిలంక మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సామంతకుర్రునకు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం మరియు రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ గోడిలంక వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇరవై రెండు వేల రూపాయలు విలువగల రెండు సౌండ్ సిస్టమ్ లను బహుకరించారు. మోసుగంటి వెంకటేశ్వరరావు మాట్లాడతూ ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ప్రణాళిక బద్ధంగా చదవాలని, ఆరవ తరగతి నుండే మంచి లక్ష్యాలతో చదివితే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్టేట్ లో మంచి ర్యాంకులు సాధించగలరని, తద్వారా ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును పొందగలరని అన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఆయా గ్రామ పెద్దలు రెండు ట్రస్టుల చేస్తున్న విద్య మరియు వైద్య సేవలను ప్రశంసిస్తూ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెండు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్ బేగం, ఎ.శరభరాజు ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి.వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్ రాజు,ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె.రమేష్ బాబు, విద్యా కమిటీ ఛైర్మన్ వాసర్ల లక్ష్మి,వి.శ్రీనివాసరాజు,సుందర్నీడి సాయికృష్ణ,వెల్ఫేర్ మాజీ అధ్యక్షులు బత్తుల నకులరాజు,కడలి త్రిమూర్తులు,ఓలేటి సూర్యప్రకాశరావు, కడలి నాగ గణేష్,యమ్.టి.వి సుబ్బారావు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

## వ్యవస్థాపక నైపుణ్యాల అభివృద్ధి పై అవగాహన





**గండేపల్లి, పెన్ పవర్, జూలై, 15:** గండేపల్లి మండలం సూరంపాలెం, ఆదిత్య విశ్వవిద్యాలయం, సివిల్ ఇంజనీరింగ్ విభాగం (అలుమ్ని) ఆధ్వర్యంలో "వ్యవస్థాపక నైపుణ్యాల అభివృద్ధి పై అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడవ మరియు నాల్గవ సంవత్సరం విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన 2019--2023 బ్యాచ్ పూర్వ విద్యార్థి, ప్రస్తుతం కాకినాడలో శ్రీ ఓషనిక్ షిప్పింగ్ సర్వీసెస్ ఽ శ్రీ ఆర్కిటిక్ లాజిస్టిక్స్ సంస్థకు సి.ఈ ఓ మరియు మేనేజింగ్ పార్టనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రిత్విక్ మామిడాల ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థు లతో తన వ్యాపార మరియు పారిశ్రామిక ప్రయాణాన్ని పంచుకున్నారు. ఉద్యోగ అవకాశాలకే పరిమితం కాకుండా, సొంత ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా ఎలా మలచుకోవాలి, ఒక స్టార్టప్‌ను ఎలా ప్రారంభించాలి, విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలు ఏమిటి అనే అంశాలపై ఆయన విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. అలాగే, విద్యార్థులు తమలో నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణాత్మక ఆలోచనలు మరియు వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ విద్యాభ్యాసంతో పాటు పారిశ్రామిక అవకాశాలపై అవగాహన పెంపొందించుకొని, భవిష్యత్తులో ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారిగా కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలనే స్ఫూర్తిని పొందారు.

# బుల్లి రైతులుగా మారిన చిన్నారులు.. అన్నం విలువను చాటిన వినూత్న కార్యక్రమం





**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 15 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి ప్రధాన ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థులు బుల్లి రైతులుగా మారి వరి సాగు చేపట్టడం విశేషంగా నిలిచింది. బుధవారం పాఠశాల లో చిన్నారులకు పాఠ్యాంశాలతో పాటు అనుభవాత్మక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలాన్ని వరి సాగుకు అనువుగా మార్చి, గత 15 రోజులుగా విద్యార్థులే స్వయంగా నీరు పోసి మడిని సిద్ధం చేశారు. అనంతరం వరి నాట్లు వేసి రైతుల పనితీరును ప్రత్యక్షంగా అనుభవించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. చిన్నారులకు అన్నం విలువ, రైతుల శ్రమ, వ్యవసాయం ప్రాధాన్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. పుస్తకాలలో చదివే వ్యవసాయ అంశాలను కేవలం సిద్ధాంతాలకే పరిమితం చేయకుండా, వాటిని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం కల్పించడం ద్వారా విద్యార్థుల్లో శ్రమ పట్ల గౌరవం, ప్రకృతి పట్ల మమకారం, వ్యవసాయం పట్ల ఆసక్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. వరి సాగులో పాల్గొన్న విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా పనిచేశారు. మడిని సిద్ధం చేయడం, నీరు పెట్టడం, వరి నాట్లు వేయడం వంటి పనుల్లో పాల్గొంటూ రైతులు పంట పండించేందుకు ఎంత కష్టపడతారో ప్రత్యక్షంగా తెలుసుకున్నామని చెప్పారు. అన్నం ప్రతి గింజ వెనుక రైతు చెమట దాగి ఉంటుందని గ్రహించినట్లు వారు తెలిపారు. స్థానికులు, తల్లిదండ్రులు పాఠశాల చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతతో పాటు శ్రమకు గౌరవం, వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# భక్తుల కానుకల వెల్లువ......వెంకన్న హుండీ ఆదాయం రూ, 2.14 కోట్లు

**27 రోజుల కానుకల లెక్కింపు పూర్తి.. విదేశీ కరెన్సీతో పాటు బంగారం, వెండి కానుకలు లభ్యం**








**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 15:** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు, జగన్మోహిని కేశవస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ద్వారపురెడ్డి సురేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు.

గత 27 రోజుల కాలంలో భక్తులు సమర్పించిన కానుకలను ప్రత్యేక ఏర్పాట్ల మధ్య లెక్కించగా మొత్తం రూ.2,14,33,242 ఆదాయం లభించినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. ఇందులో ప్రధాన హుండీ ద్వారా రూ.1,66,13,656, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ.48,19,586 సమకూరింది.

ఈ సందర్భంగా హుండీల్లో దేశీయ కరెన్సీతో పాటు అమెరికా, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, కెనడా, మొరాకో తదితర దేశాలకు చెందిన 94 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. వీటి విలువ సుమారు రూ.7.18 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. అలాగే భక్తులు సమర్పించిన 19 గ్రాముల 1 క్యాష్ బంగారం మరియు 237 గ్రాముల వెండి కానుకలను కూడా గుర్తించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవోలు ఎం. రాధాకృష్ణ, బి. కిరణ్, ఎం. సత్యనారాయణ, ధర్మకర్తలు, అర్చకులు, ఆలయ సిబ్బంది, స్వామివారి సేవకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. కోనసీమలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతి నెలా వేలాది మంది భక్తులు తరలివస్తుండగా, ఈసారి నమోదైన రూ.2.14 కోట్లకు పైగా హుండీ ఆదాయం భక్తుల విశ్వాసానికి నిదర్శనమని ఆలయ అధికారులు పేర్కొన్నారు.



# అభివృద్ధి చూసి ఓర్వలేకే జగ్గిరెడ్డి ఆరోపణలు: టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్





**'ప్రజలు తిరస్కరించినా బుద్ధి రాలేదు.. అసత్య ప్రచారాలతో రాజకీయ మనుగడ కోసం తాపత్రయం'**

**రావులపాలెం, పెన్ పవర్ జూలై 15:** కొత్తపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని రావులపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

బుధవారం రావులపాలెంలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఘోరంగా తిరస్కరించిన తర్వాత కూడా వైసీపీ నాయకుల తీరు మారలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై చర్చించాల్సింది పోయి అసత్య ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలతో రాజకీయ మనుగడ కోసం ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుండగా, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు కనిపిస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకే జగ్గిరెడ్డి వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విమర్శలు చేసే ముందు వైసీపీ హయాంలో జరిగిన పాలనను, ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. ఆధారాలు లేకుండా రాజకీయ ఆరోపణలు చేయడం మానుకోవాలని, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని సూచించారు. లేదంటే ప్రజలే మరోసారి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

అంతకుముందు ఇటీవల కన్నుమూసిన మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతికి సమావేశంలో సంతాపం ప్రకటించారు. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు కొప్పిశెట్టి ప్రసాద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామవరంలో పొలం పిలుస్తోంది



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 15:** మండలంలోని రామవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంపేట వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం పై రైతులకు వివరించారు. ఆకు మడుల్లో వేయాల్సిన ఎరువుల మోతాదుల గురించి అవగాహన కల్పించారు. పంట ఇన్సూరెన్స్ పథకంపై తెలియజేశారు. ఎరువులను యాప్ లో బుక్ చేసుకోవాలని లేదంటే స్థానిక రైతుసేవ కేంద్రాల్లో ఎరువుల కోసం సంప్రదించాలన్నారు. రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com